నమస్తే తెలంగాణ
నిర్మల్
5 | నిజామాబాద్, సోమవారం 29 జనవరి 2024 | NIRMAL

టాలెంట్ టెస్టులతో భయం పోతుంది..

విద్యార్థులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, జనవరి 28 : పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన టాలెంట్ టెస్టుతో భయం పోతుందని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని నలంద కళాశాలలో తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం(టీఏవీఎస్) ఆధ్వర్యంలో టాలెంట్ టెస్టును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామన్న హాజరై మాట్లాడారు. విద్యార్థులు పరీక్షలపై భయం వీడి ఫైనల్ పరీక్షకు సిద్ధం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూసం సచిన్, కళాశాల యాజమాన్యం విజయ్‌బాబు, జెవీవీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంతోష్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆదివాసులపై రేవంత్‌రెడ్డి స్పష్టత ఇవ్వాలి..

మాట్లాడుతున్న తుడుందెబ్బ రాష్ట్ర కార్యనిర్వహణ అధ్యక్షుడు గణేశ్

ఆదిలాబాద్ రూరల్, జనవరి 28 : ఇంద్రవెల్లికి రానున్న సీఎం రేవంత్‌రెడ్డి ఆదివాసుల చట్టాలపై స్పష్టత ఇవ్వాలని తుడుందెబ్బ రాష్ట్ర కార్యనిర్వహణ అధ్యక్షుడు గణేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చట్టబద్ధతలేని లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉయిక సంజీవ్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి కొడప నగేశ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి కుమ్ర శ్యాంరావ్, జిల్లా అధ్యక్షుడు పుర్క బాపురావ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్ పాల్గొన్నారు.

జంగూన్ భూయారీ ఆలయానికి వెళ్లున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

జంగుబాయికి పోటెత్తిన జనం

జంగూన్ భూయారీ దేవస్థానంలో ఆదివాసుల పూజలు

ఇంద్రవెల్లి, జనవరి 28 : ఇంద్రవెల్లి మండలంలోని దోడంద గ్రామ పంచాయతీ పరిధిలో గల జంగూన్ భూయారీ దేవస్థానాన్ని ఆదివారం పుష్యమాసాన్ని పురస్కరించుకుని ఆదివాసులు దర్శించుకున్నారు. జంగూన్ భూయారీ దేవస్థానంలో కొలువుదీరిన జంగుబాయి దేవతకు పూజలు చేశారు. కొండలు, కోనలు, వంకలను దాటుతూ ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గిరిజనదేవతకు నైవేద్యాలు సమర్పించారు. అనంతరం వంటలు చేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు.

ఆలయం అభివృద్ధి కృషి

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

జంగూన్ భూయారీ దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివానం కొండలు, కోనలు, వాగులు వంకల వంటి వాటిని దాటుతూ దాదాపు రెండు కిలోమీటర్ల మేర కాలినడక ప్రయాణించి జంగుబాయిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజనులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా.. పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

జంగూన్ భూయారీ దేవస్థానానికి హారతితో వస్తున్న ఆదివాసీ గిరిజన మహిళలు

స్పెషల్ రిపోర్ట్

● ఇక ప్రత్యేకం

పదేళ్ల అనంతరం కాంగ్రెస్ హయాంలోనే ప్రత్యేక అధికారుల పాలన

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఏనాడు పంచాయతీ ఎన్నికలపై దృష్టి సారించలేదు. కేసీఆర్ ప్రభుత్వం సమయానుకూలంగా ఎన్నికలను నిర్వహించింది. 2018లో నూతన పంచాయతీరాజ్ చట్టాన్ని అమల్లోకి తెచ్చి పల్లె ప్రగతి కార్యక్రమంతో గ్రామాల రూపురేఖలు మార్చేసింది. 60 ఏండ్ల పాలనలో జరగని అభివృద్ధిని పదేండ్లలో చేసి చూపించింది. ఇప్పుడు అట్లా కాంగ్రెస్ గెలిచిందో లేదో ఇట్లా ఎన్నికలకు అడ్డుకట్ట వేసింది. ప్రత్యేక పాలన తెచ్చిందంటూ గ్రామాల్లోని నాయకులు, ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఎంపీ ఎన్నికలు ఎప్పుడైపోతాయి.. కులగణన ఎప్పుడు చేస్తారు.. రిజర్వేషన్లపై ఎప్పుడు స్పష్టత వస్తుంది.. ఆరు గ్యారెంటీల అమల్లోకి ఎప్పుడు వస్తాయి.. ఇవన్నీ అయ్యే దాకా ఎన్ని రోజులపాటు ప్రత్యేక అధికారుల పాలన ఉంటుంది. అనే విషయాలపై సందిగ్ధత నెలకొంది.

- ఫిబ్రవరి 1వ తేదీతో ముగియనున్న పాలకవర్గాల గడువు
- ఎన్నికలకు అడ్డుకట్ట.. పెదవి విరుస్తున్న గ్రామాల్లోని నాయకులు
- ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా ఎన్నికలకు వెళ్లడానికి జంకు
- అందుకే ఎన్నికల నిర్వహణపై వెనకడుగు వేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- ప్రత్యేక అధికారుల ఎంపికపై దృష్టిసారించిన అధికార యంత్రాంగం
- రేపో, మాపో ఉత్తర్వులు వెలువడే అవకాశం

మంచిర్యాల, జనవరి 28(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గ్రామ పంచాయతీ(జీపీ)ల్లో ప్రత్యేక పాలనకు రంగం సిద్ధమైంది. పదేళ్ల క్రితం కాంగ్రెస్ హయాంలోనే పంచాయతీల్లో ప్రత్యేక పాలన ఉండేది. ఇప్పుడు అదే రిపీట్ కానున్నది. జీపీ పాలకవర్గాల గడువు ఫిబ్రవరి 1వ తేదీతో ముగియనున్నది. నిబంధనల ప్రకారం ఇప్పటికే ఎన్నికల నిర్వహణ పూర్తి కావాలి. కానీ.. కొత్త సర్కార్ ఆ దిశగా ఆలోచన చేయడం లేదు. పంచాయతీరాజ్ కొత్త చట్టాన్ని అనుసరించి పదవీకాలం పూర్తయ్యాక ఆయా పాలకవర్గాలను పర్సన్ ఇన్‌చార్జిలుగా కొనసాగించేందుకు కొత్త చట్టం అనుమతించడం లేదు. ఇప్పటికిప్పుడు చట్ట సవరణ చేయడం లేదా ఆర్డినెన్స్ తీసుకురావడం సాధ్యమయ్యే విషయం కాదు. దీంతో ఎలా చూసుకున్నా పంచాయతీల్లో స్పెషల్ ఆఫీసర్ల పాలన తప్పేలా లేదు. ఈ మేరకు ఇప్పటికే కసరత్తు మొదలు పెట్టిన సర్కారు రెండు, మూడు రోజుల్లో స్పెషల్ ఆఫీసర్లను నియమిస్తూ ఉత్తర్వులను ఇచ్చే అవకాశాలు ఉన్నాయి.

రిజర్వేషన్ల హామీ.. ఎంపీ ఎన్నికలు.. ఆరు గ్యారెంటీలు..

ఎన్నికలకు ముందు పంచాయతీల్లో బీసీ రిజర్వేషన్లను పెంచుతామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ఈ మేరకు త్వరలోనే కులగణన చేపడుతామని పేర్కొంది. దీంతో ఈ ఎన్నికల్లో రిజర్వేషన్ల మార్పు తప్పనిసరి అయ్యింది. నూతన పంచాయతీరాజ్ చట్టం ప్రకారం రిజర్వేషన్లు పదేళ్లపాటు అమలులో ఉంటాయి. 2018లో ఎన్నికలు నిర్వహించిన సమయంలో ఖరారు చేసిన రిజర్వేషన్ల లెక్క ప్రకారం 2028 వరకు అమలులో ఉండాలి. కానీ.. ప్రస్తుత ప్రభుత్వ ఎన్నికల హామీ మేరకు కుల గణన చేసి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లను నిర్ణయించే వరకు పంచాయతీలకు ఎన్నికలు ఉండేలా లేవు. మరోవైపు లోక్‌సభ ఎన్నికలు ముందస్తుగా వస్తుండడం, ఫిబ్రవరిలో నోటిఫికేషన్ రానుండడం పంచాయతీ ఎన్నికల వాయిదాకు మరో కారణంగా తెలుస్తున్నది. రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో ఎంపీ ఎన్నికలను కాంగ్రెస్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నది. దానికి ముందు ఆరు గ్యారెంటీల అమలుకు అవసరమైన సర్వే పూర్తి చేయించి జనంలోకి వెళ్లాలని వ్యూహరచన చేస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీలో చర్చ నడుస్తున్నది. గ్యారెంటీలు అమలు చేయకుండా సర్పంచ్ ఎన్నికలకు వెళ్తే ప్రజల నుంచి తీవ్రమైన వ్యతిరేకత వచ్చే చాన్స్ ఉందని పార్టీ అధిష్టానం భావిస్తున్నది. ఈ మేరకు ముందు ఎంపీ ఎన్నికల అనంతరం గ్యారెంటీల అమలు అయ్యాక గానీ పంచాయతీ ఎన్నికలు నిర్వహించేలా కనిపించడం లేదు.

మండల స్థాయి అధికారులే ఇన్‌చార్జిలు

గ్రామ పంచాయతీల్లో ఇన్‌చార్జిలుగా మండల స్థాయి అధికారులను నియమించనున్నట్లు తెలుస్తున్నది. లోక్‌సభ విధులతో సంబంధం లేకుండా ఉండే మండల స్థాయిలోని అధికారులను పంచాయతీలకు ఇన్‌చార్జిలుగా నియమించనున్నట్లు సమాచారం. ఎంపీడీవోలు, ఎంపీవోలు, తహసీల్దార్లు, గెజిటెడ్ హోదా ఉన్న ఇతర శాఖల అధికారులకు ఈ బాధ్యతలు అప్పగిస్తారు. ఆయా మండలాల్లోని పంచాయతీల ఆధారంగా ఇతర శాఖల అధికారుల సేవలను ఉపయోగించుకోనున్నారు. చిన్న గ్రామాలైతే రెండు, మూడు గ్రామాలకు ఒకే అధికారికి ప్రత్యేక బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది. సాధ్యమైనంత వరకు ఇతర శాఖల అధికారుల అవసరం రాకుండా చర్యలు తీసుకుంటున్నారు.

ఉమ్మడి జిల్లాలోని గ్రామ పంచాయతీలు

జిల్లా	పంచాయతీలు
మంచిర్యాల	311
ఆసిఫాబాద్	335
ఆదిలాబాద్	468
నిర్మల్	396

ఝరితో తిరుగు పయనం

- గోదావరి వద్ద హస్తినమడుగులో గంగాజలం సేకరణ
- దస్తురాబాద్ మండలంలోని మల్లాపూర్ గొండు గూడెంలో బస
- ప్రత్యేక పూజలు చేసిన మెస్రం వంశీయులు, ఆదివాసులు

ఝరికి పూజ చేస్తున్న మెస్రం వంశీయులు

దస్తురాబాద్, జనవరి 28 : నాగోబాకు పవిత్ర గంగాజలాన్ని తీసుకొచ్చేందుకు ఈనెల 21వ తేదీన ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ నుంచి పాదయాత్రగా బయలుదేరిన మెస్రం వంశీయులు శనివారం రాత్రి దస్తురాబాద్ మండలానికి చేరుకున్నారు. మల్లాపూర్ గొండు గూడెంలోని ఆశ్రమ పాఠశాలలో బస చేశారు. వీరికి గ్రామ పటేళ్లు, మెస్రం వంశీయులు సంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికారు. సోమవారం ఉదయం మెస్రం వంశీయులు, ఆదివాసులు మంచిర్యాల జిల్లాలోని జన్నారం మండలంలో గల కలమడుగు గ్రామ శివారులోని గోదావరిలో స్నానాలను ఆచారించారు. హస్తినమడుగులో పవిత్ర గంగాజలాన్ని సేకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యం సమర్పించారు. అక్కడే సామూహికంగా భోజనాలు చేశారు. అనంతరం సేకరించిన గంగాజలంలో తిరుగు పయనం అయ్యారు. ఇందులో 21 తెగలకు చెందిన 235 మంది మెస్రం వంశీయులు పాల్గొన్నారు. తిరుగు పయనంలో 70 కిలోమీటర్లు పాదయాత్రగా కేస్లాపూర్‌కు వెళ్లి ఫిబ్రవరి 9వ తేదీన నాగోబా మహాపూజ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన మెస్రం వంశీయులు, ఆదివాసులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

గంగాజలంతో తిరుగు పయనం అయిన మెస్రం వంశీయులు

పింఛనస్తలేదయ్యా..

- ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కు వృద్ధుడి మొర

రచ్చబండ వద్ద ఎమ్మెల్యేకు సమస్యలను విన్నవించుకుంటున్న వృద్ధుడు

'అయ్యా.. ఎమ్మెల్యే సాబ్ దండాలయ్యా.. నేను ముసలోడిని.. కాళ్లు చేతులు ఆడుతలేవు. పనిజేద్దామంటే ఓసతిలేదు. కేసీఆర్ సారు ఇచ్చిన పింఛన్ పైసల మీదనే బతుకుతున్నాం. సారు పింఛన్ డబ్బులు టైంకిస్తుండే. గిప్పుడు పింఛన్ పైసలస్తలేవు. మా మనవళ్లనడిగితే కేసీఆర్ సార్ రాలేదంటగ అని జెప్పిన్రు. మరీ గిప్పుడు ఎవరో వచ్చారంట.. గిప్పటికీ డబ్బులస్తలేవు. ఏం జేయమంటరు. కేసీఆర్ సారు ఇచ్చిన పైసలతో రందీలేకుండా బతికినం. గీ కాంగ్రేసు సర్కారోళ్లు ఎన్నికలప్పుడేమో పింఛన్ పెంచిత్తమన్నరు. పింఛన్ పెంచుడేమోగని అసలువే ఇస్తలేరు. ఎలాగైనా మీరే ఇప్పియ్యాలే.. జరసూడుర్రి..' అని రాములు తాత అనే వృద్ధుడు బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కుమార్‌కు మొర పెట్టుకున్నాడు. ఎమ్మెల్యే జాదవ్ ఆదివారం తాంసి మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్ర భవన నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అనంతరం ఊరి రచ్చబండ వద్ద వృద్ధులు ఉండగా.. వారిని ఆప్యాయంగా పలకరించాడు. దీంతో వృద్ధులు తమ పింఛన్ సమస్యను విన్నవించుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి వచ్చేట్టుగా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ ఒక్క ఘటన చాలు కేసీఆర్ ప్రజల గుండెలో ఏ స్థాయిలో ఉన్నారో చెప్పడానికని స్థానికులు చర్చించుకోవడం కనిపించింది. ***- తాంసి, జనవరి 28***

పడిపోతున్న నీటిమట్టం

- నిర్మల్ జిల్లాలో భారీగా తగ్గిన భూగర్భ జలాలు
- గతేడాదితో పోలిస్తే మీటరు కిందికి..
- డిసెంబర్‌లో 6.50 మీటర్ల లోతుకు చేరిన జలాలు
- తక్కువ వర్షపాతం, అధిక వాడకం వల్లనే పరిస్థితి
- వచ్చే వేసవి నాటికి 10 మీటర్లకు చేరనున్న భూగర్భ జలాలు
- సాగు, తాగునీటికి తప్పని తిప్పలు.. తగ్గిన సాగు

నిర్మల్, జనవరి 28(నమస్తే తెలంగాణ) : నిర్మల్ జిల్లాలో భూగర్భ జలాలు వేగంగా పడిపోతున్నాయి. గతేడాదితో పోలిస్తే మీటరు నుంచి రెండు మీటర్ల వరకు తగ్గాయి. దీంతో రాబోయే రోజుల్లో తాగు, సాగునీటి కష్టాలు తప్పేలా లేవు. ఈసారి ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురియకపోవడం, నీటి వినియోగం పెరగడంతో భూగర్భ జలాలు పడిపోతున్నాయని అధికారులు చెబుతున్నారు. మరోవైపు ప్రాజెక్టులు, చెరువుల్లో నీటి నిల్వలు తగ్గడం, బోరుబావుల్లో అడుగంటడంతో జిల్లావ్యాప్తంగా యాసంగి సాగు విస్తీర్ణం తగ్గిందంటున్నారు. కడెం ప్రాజెక్టు గేట్లకు మరమ్మతులు చేపట్టాల్సి రావడంతో వానకాలంలో వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువనకు వదిలిపెట్టారు. దీంతో కడెం ఆయకట్టు కింద క్రాప్ హాలిడేను ప్రకటించారు. సారంగాపూర్ మండలంలోని స్వర్ణ, భైంసా మండలంలోని గడ్డెన్న వాగు, ఎస్సారెస్పీతోపాటు చెరువుల్లో కూడా నీటి మట్టాలు తగ్గుముఖం పట్టాయి. జిల్లా వ్యాప్తంగా గత డిసెంబర్‌లో సగటున 6.50 మీటర్ల లోతులో నీళ్లున్నట్లు అధికారులు గుర్తించారు. 2022 డిసెంబర్‌తో పోలిస్తే 2023 డిసెంబర్‌లో భూగర్భ జలాలు 1.30 మీటర్ల మేర ఇంకిపోయాయి. సరిగ్గా ఏడాది క్రితం అంటే 2022 డిసెంబర్‌లో సగటున 5.20 మీటర్ల మేర జలాలు ఉన్నాయి. గతేడాదితో పోలిస్తే ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా సగటున 1.5 మీటర్ల లోతుకు నీటి మట్టాలు పడిపోయాయంటున్నారు.

భైంసా మండలంలోని మహాగాంలో ఈ యేడు వరి వేయకుండా వదిలేసిన భూమి

చిన్న బెల్లాల్‌లో 26 మీటర్ల లోతులో..

జిల్లావ్యాప్తంగా 42 చోట్ల ఏర్పాటు చేసిన ఫీజో మీటర్ల ద్వారా ప్రతినెలా భూగర్భ జలశాఖ అధికారులు నీటి మట్టాల వివరాలను సేకరిస్తున్నారు. జిల్లాలో అత్యధికంగా కడెం మండలం చిన్న బెల్లాల్‌లో 26 మీటర్ల లోతులో జలాలు ఉన్నట్లు గుర్తించారు. కాగా.. రాబోయే రోజుల్లో ప్రతి నెల అర మీటరు వరకు నీటి మట్టం తగ్గే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ లెక్కన వచ్చే ఏప్రిల్, మే నాటికి జిల్లాలో సగటున 10 మీటర్ల వరకు నీటి మట్టాలు పడిపోయే అవకాశం ఉన్నది. దీంతో బోరుబావుల నుంచి వచ్చే నీటి సామర్థ్యం తగ్గిపోయి, పంటలకు సరిపడా నీరందే అవకాశం ఉండదంటున్నారు.

తగ్గిన సాగు

యాసంగి సాగు విస్తీర్ణం తగ్గింది. ఈ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 2.70 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ఇందులో అత్యధికంగా లక్ష ఎకరాల్లో వరి వేస్తారని భావించారు. అయితే ఈసారి గతేడాది కంటే 20 వేల ఎకరాల్లో సాగు తగ్గే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. గతేడాది యాసంగిలో జిల్లా వ్యాప్తంగా 1,07,000 ఎకరాల్లో వరి వేయగా, ఈసారి ఇప్పటివరకు 85 వేల ఎకరాల్లో వరి వేశారు. పంట చేతికొచ్చే సమయంలో సరిపడా సాగునీరు అందుతుందో లేదోనన్న భయంతోనే పంటలు వేయడానికి రైతులు ముందుకురావడం లేదని అధికారులు పేర్కొంటున్నారు. నీటి ఆధార పంటల విస్తీర్ణం గతేడాది కంటే ఈ యాసంగిలో తగ్గిందని చెబుతున్నారు.

గతేడాది కంటే లోతులో జలాలు..

నీటి ఆధారిత పంటలతో బోరుబావులపై ఒత్తిడి పెరిగింది. మన వద్ద సాగు నీటి కోసం భూగర్భ జలాలను అధికంగా వినియోగిస్తారు. ఒక ఎకరా పొలం సాగుకు దాదాపు 1.2 క్యూబిక్ మీటర్ల నీటిని వినియోగించడం వల్ల భూగర్భ జలాలు క్రమంగా తగ్గుతున్నాయి. వచ్చే వేసవి నాటికి బోరు బావుల్లో నీటి సామర్థ్యం ఇంకా తగ్గే అవకాశం ఉన్నది.

- శ్రీనివాస్ బాబు, డీడీ, భూగర్భ జలశాఖ, నిర్మల్.

రైతుల ఉసురు పోసుకుంటున్న బీజేపీ, కాంగ్రెస్

బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కుమార్

తాంసి, జనవరి 28 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నాయని ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జాదవ్ మాట్లాడుతూ.. బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు పత్తి రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నాయని, వారి ఉసురు తగులుతుందని మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేపట్టామని గుర్తు చేశారు. ప్రస్తుతం మహారాష్ట్రలో ధర అధికంగా ఉండడంతో అక్కడకు వెళ్తున్నారని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఈ రెండు పార్టీలకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. అనంతరం మండల కేంద్రంలో రూ.20 లక్షలతో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్ర భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి, ఎంపీపీ మంజుల, జడ్పీటీసీ తాటిపల్లి రాజు, వైస్ ఎంపీపీ ముచ్చ రేఖ, సీఈవో కేశవ్, సర్పంచ్‌లు స్వప్న, సదానందం, వెంకన్న, అశోక్, లింగారెడ్డి, లక్ష్మీపతి, శ్రీకాంత్‌రెడ్డి, రజినీకాంత్, నాగారెడ్డి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కుమార్